## క్లుప్తంగా

### ముగిసిన రిలే నిరాహార దీక్షలు



**తెనాలిఅర్బన్:** ఆర్టీసీ అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం దీక్షల్లో పాల్గొన్న నాయకులతో డిపో మేనేజర్ చర్చలు జరిపారు. చర్చలు ఫలించడంతో దీక్షలు విరమిస్తున్నట్లు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. ఎన్‌వీపీ బాబు, ఎన్.సుధాకర్, టి.వి.జి.రావు, వి.రవిప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.అబ్రహాం, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కాంతారావు ఉన్నారు.

### భవిత సెంటర్‌కు బోధన పరికరాలు వితరణ

**తెనాలిఅర్బన్:** మానసిక వైకల్యం కలిగిన ఆరుగురు విద్యార్థుల్లో ఐక్యూ లెవల్స్ పెంచేందుకు దోహదపడేందుకు బోధనా పరికరాలను ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ మంగళవారం బాలాజీరావుపేటలోని భవిత సెంటర్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం భవిత సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన కౌన్సెలింగ్, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ షరీఫ్, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు వై.రజనీకుమారి, డి.సునీత, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం.. ప్రాణదానం



**తెనాలిఅర్బన్:** రక్తదానంతో ప్రాణాలను నిలబెట్టవచ్చని ప్రముఖ న్యాయవాది పొన్నం విజయకుమార్ పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకుని వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ వైద్యులు, సిబ్బంది రక్తసేకరణ జరిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అంబిక, కె.గోపి, షేక్ షఫీ, గురజాల ప్రసాద్, సురపనేని శ్రీను, అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.

### ముమ్మరంగా రహదారుల నిర్మాణం



**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో రహదారి నిర్మాణాలను ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులతో చేపట్టారు. మంగళవారం నుంచి ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దుగ్గిరాల మండలం మంచికలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు గ్రామాల్లో సుమారు 10 రోడ్ల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఈమని గ్రామంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. పెనుమూలి ముస్లిం ఈద్గా, ఎస్సీ కమ్యూనిటీ హాల్ గ్రావెల్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశారు. మంచికలపూడిలో బీసీ, ఎస్సీ కాలనీలలో గ్రావెల్ రోడ్ నిర్మాణం, కంఠంరాజు కొండూరులో గ్రావెల్ రోడ్ నిర్మాణాలతోపాటు హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటికల్లో గ్రావెల్ ఫిల్లింగ్, అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టారు. దాదాపుగా 10 రోడ్ల నిర్మాణాలతోపాటు శ్మశానవాటికలను గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

### పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, బియ్యం పంపిణీ

**తాడికొండ:** పేదలకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుస్తులు, బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజు మాట్లాడుతూ నిత్యం ప్రజలతో మమేకమై వారికి సేవలు అందిస్తున్న చిరుద్యోగులకు సాయం అందించేందుకు బెజ్జం సాయిప్రసాద్ తన వంతు బాధ్యతగా ముందుకు రావడం హర్షనీయమన్నారు. మరికొంత మంది దాతలు స్పందించి గ్రామాల్లో అరకొర జీతాలతో కాలం గడుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు, ఆశ కార్యకర్తలు, పేదలకు సాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు. 18 మంది పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు ఆశ వర్కర్లు, ముగ్గురు సచివాలయ కన్వీనర్లకు ఉచితంగా బియ్యం, దుస్తులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సలీం, దాసరి రంగారావు, షేక్ హుస్సేన్, గోల్డ్ బాబు పాల్గొన్నారు.

# పక్కా డ్రెయిన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే శివకుమార్
- కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలిటౌన్:** డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలకు గురైన వాటిని తొలగిస్తామని, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం రెండో రోజు సినిమాహాలు సెంటర్ నుంచి ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుకుంటున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుని వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కొలకలూరులో సచివాలయం-2 పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.25కోట్ల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. నవరత్నాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ పేదవాని జీవన ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తుందన్నారు. మసీదు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణీకుమార్, డిసిఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, వీరమల్లు కార్తీకేయ, షేక్ జిలానీ, షేక్ నాగూర్, అమీర్ బాషా, ఖాజావలి, మల్లవరపు బుల్లయ్య, వినయ్, ప్రసాదం సురేష్, పినపాటి అనిల్, కొలకలూరి నాగేశ్వరరావు, ధూళ్ళ శ్రీనివాసరావు, ఉన్నం రాజేంద్ర, మోర వెంకటేశ్వరెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, రోశిరెడ్డి, అంచే రోశయ్య, గంపల పెద్దబ్బాయి, పోలిశెట్టి కోటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

# తెగుళ్ల నివారణపై అవగాహన అవసరం

- ఆత్మ పీడీ రామాంజనేయులు
- వరి సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు

**తెనాలిటౌన్:** వరిపైరులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రామాంజనేయులు రైతులకు సూచించారు. రూరల్ మండలం కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు వరి సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ అధ్యక్షత వహించారు. ఆత్మ పీడీ రామాంజనేయులు మాట్లాడుతూ వరిలో కలుపు యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు. పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వరిలో పైపాటుగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను వాడరాదని సూచించారు. మొదటి దఫా ఎరువుతో పాటు ఎకరానికి 25 కిలోల పొటాష్ ఎరువులను తప్పని సరిగా వాడాలన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త జి.నగేష్, జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి ఎం.రాజవంశీలు మాట్లాడారు. ఏఈఓ మోహన్, వీఏఏ నాగరాజు రైతులు పాల్గొన్నారు. తొలుత శాస్త్రవేత్తలు, అధికారులు వెద పద్ధతిలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

# పిండ మార్పిడి పద్ధతితో మేలు జాతి పశువుల ఉత్పత్తి



పుట్టిన దూడను పరిశీలిస్తున్న లాం శాస్త్రవేత్తలు, పశుగణాభివృద్ధి సంస్థ బృందం

**తాడికొండ:** పిండ మార్పిడి పద్ధతిలో సంతానోత్పత్తి చేపట్టడం ద్వారా మేలు జాతి పశువులను ఉత్పత్తి చేయవచ్చని లాం ఫాం శస్త్రవేత్తల బృందం తెలిపింది. తాడికొండ మండలం రావెల గ్రామంలో పిండ మార్పిడి పద్ధతి ద్వారా గేదెల్లో సంతానోత్పత్తి చేసేందుకు అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టి విజయవంతంగా ఉత్పత్తి చేసిన దూడను మంగళవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ పద్ధతిలో అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టిన వీర్య ద్వారా పుట్టిన దూడ ఆరోగ్యంగా ఉందని వారు తెలిపారు. రైతు షేక్ సైదా, ముప్వా శేషగిరిరావుకు చెందిన గేదెల్లో లింగనిర్ధార వీర్యం ద్వారా అభివృద్ధి చేసిన దూడను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈనెల 10 - 13వ తేదీన ముర్రా జాతి దూడలు జన్మించాయని తెలిపారు. ఇప్పటి వరకు లింగమార్పిడి పద్ధతి ద్వారా సంతానోత్పత్తి కేవలం ఆవుల్లో మాత్రమే జరిగేదని, తొలిసారి ఏపీలో ప్రవేశపెట్టి విజయవంతం చేసినట్లు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీమన్నారాయణరావు, ఈఓ డాక్టర్ బాలశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, స్థానిక వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు. పిండ మార్పిడి పద్ధతిలో సంతానోత్పత్తికి సహకరించిన స్థానిక వైద్యులు డాక్టర్ రవితేజ, డాక్టర్ సౌజన్యలను అధికారులు అభినందించారు.

# ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాం

మంగళగిరి నియోజకవర్గ ఈఆర్ఓ కె.లలిత



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న నియోజకవర్గ ఈఆర్ఓ కె.లలిత

**తాడేపల్లిరూరల్:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తొలగించే ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించామని, రాబోయే ఎన్నికల్లో పారదర్శకమైన ఓటర్ల జాబితాను అందించేవిధంగా పనిచేస్తున్నట్లు మంగళగిరి నియోజకవర్గ ఈఆర్ఓ కె.లలిత అన్నారు. మంగళవారం మంగళగిరి అర్బన్ పరిధిలోని 148, 167 పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓట్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. లలిత మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా జాబితాను సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఇంటింటి సర్వే చేపట్టిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్తగా అర్హులైన వారికి ఓటు హక్కు నమోదు చేయడం జరుగుతుందని, ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఆ వ్యక్తి ప్రతిపాదనకు అవసరమైన చోట ఓటు హక్కు ఉంచి, అవసరం లేని చోట ఓటు హక్కు తొలగిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఓటరు జాబితాలో పేర్లు లేని 18 సంవత్సరాల వయసు నిండిన వారిని ఓటరుగా నమోదు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఓట్లను నమోదు చేయడంలో గానీ, తొలగింపులో కానీ అవకతవకలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి అర్బన్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.హేమమాలిని, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చక్రస్థాపన మహోత్సవాలు



విద్యుద్దీప ధగధగల్లో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం

**యనమదల (ప్రత్తిపాడు):** యనమదలలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం చక్రస్థాపన మహోత్సవాలకు ముస్తాబయ్యింది. గ్రామంలో కొలువుదీరిన వీరభద్రుని దేవాలయంలో ఈ నెల 23 నుంచి శ్రీ చక్రస్థాపన మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు వాసు శర్మ తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం కంకణధారణ, 108 అఖండాలతో శ్రీ చక్ర సహిత గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. గురువార అంకురారోపణ, వాస్తుహోమం, హోమ క్రతువులు, శ్రీచక్ర స్వరూపిణి అయిన అమ్మవారికి విశేష పూజలు జరపనున్నారు. అనంతరం రుద్రహోమం, నవగ్రహోమం, దాన్యాధివాసం జరగనున్నాయని చెప్పారు. 25న సామూహిక కుంకుమార్చన, వీరభద్రునికి పల్లెర మహోత్సవాన్ని నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం జరగనుందని వాసుశర్మ వివరించారు. సాయంత్రం చండీ హోమం, శ్రీచక్రస్థాపన జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. విద్యుత్‌దీప కాంతులతో దేవస్థానం అలరారుతోంది.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

– డీఎల్‌పీఓ స్వరూపరాణి



**కొల్లిపర:** గ్రామాలల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రతేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీఓ స్వరూపరాణి అన్నారు.మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్యంపై సూచనలు, సలహాలు అందజేశారు. పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ ఎస్ఐ బదిలీ

**తెనాలిరూరల్:** తెనాలి ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయనన్ను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు మంళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఇక్కడ రిలీవ్ అయ్యారు. మరో ఎస్ఐ బి.శివరామయ్య ట్రాఫిక్ ఎస్ఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్ బదిలీ కావడంతో శివరామయ్య ట్రాఫిక్ ఎస్ఐగా పూర్తి బాధ్యతలు చేపట్టారు.

# ఘనంగా జానపద కళా ఉత్సవాలు



కళాఉత్సవంలో పాటలు పాడుతున్న కళాకారులు

**తెనాలి:** అంతర్జాతీయ జానపద కళాదినోత్సవం సందర్భంగా మంగళవారం అభ్యుదయ కళాసమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జానపద కళా ఉత్సవాలను నిర్వహించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఒకప్పటి ప్రజల అలవాట్లు, ఆచారాలే జానపద సంస్కృతిగా వక్తలు చెప్పారు. ఆ క్రమంలోనే జానపద కళలు అభివృద్ధి చెందాయని తెలిపారు. జానపద కళలను ఆదరించి, వాటిని కనుమరుగు కాకుండా చూడాలని అన్నారు. రచయిత ప్రొఫెసర్ బి.లలితానందప్రసాద్, ప్రముఖ హరికథా భాగవతార్ బెజ్జంకి నాగమణి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, వాల్మీకి విజయలక్ష్మి, విజయదుర్గ, శారదా చలపతి, పార్వతి, బెల్లంకొండ వెంకట్, టీజేఎం రావు, ఎంవీ రఘునాధరావు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి నీలాంబ్రం, గాయని కళ్యాణి, పెద్దిరాజు, తులసి పాల్గొన్నారు. పలు జానపద కళలను కళాకారులు ప్రదర్శించారు. శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు కట్టబెడుతున్న కేంద్రం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

**తెనాలి:** కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలకు పాల్పడుతోందని సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి ఆరోపించారు. దేశంలో జరుగుతున్న మైనారిటీలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, చర్చిల విధ్వంసం వంటి చర్యలను లౌకికవాదులు ఖండించాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఈనెల 25న గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగే సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున జనం తరలిరావాలని కోరుతూ మంగళవారం ఆయన రూరల్ మండల గ్రామాలైన కఠెవరం, ఎరుకలపూడిలో కరపత్రాలను పంపిణీ చేశారు. కంచర్ల తారకేశ్వరరావు, షేక్ మస్తాన్, షేక్ అబ్దుల్ గఫూర్, షేక్ ఖాదర్, పీకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత



భోజనం ప్లేట్లు అందజేసిన దర్శకుడు దిలీప్‌రాజా

**ఖాజీపేట(తెనాలి):** తెనాలి రూరల్ మండలం ఖాజీపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సినీదర్శకుడు దిలీప్‌రాజా భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. అక్కడ చదివే గిరిజన విద్యార్థులతోపాటు మిగిలిన విద్యార్థులకూ వీటిని అందజేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సినీదర్శకుడిగా ఉంటూ అణగారిన వర్గాలు, కుష్ఠురోగులు, హెచ్ఐవీ పీడితులకు సాయం అందిస్తున్న దిలీప్‌రాజాను ఆయన అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ మాట్లాడుతూ, తాము అడిగిన వెంటనే స్పందించి, పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం చేసేందుకు అవసరమైన భోజనం ప్లేట్లను సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల ఆందోళన

**తాడేపల్లిరూరల్:** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ మంగళవారం వడ్డేశ్వరంలోని రాష్ట్ర సీడీఎంఏ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రంగనాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అన్నవరపు ప్రభాకర్, హనుమంతరావు, చిన్ని సత్యనారాయణ, రామచంద్రయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరి బందెల రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కోశాధికారి తాడికొండ వాసు, రాష్ట్ర సమితి సభ్యులు వశ్రీ, సురేష్‌కుమార్, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



వృద్ధురాలిని వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు



జెడ్పీపాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

**ఫిరంగిపురం:** ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. వైద్యసేవలు సరిగా అందుతున్నాయా, నెలకు సరిపడా మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగుల వద్దకు వెళ్లి ఏ పరీక్షలు చేశారనే దానిపై వైద్యురాలు యానీగ్రేస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి ఒక్కరి పేరు నమోదు చేస్తున్న వివరాలు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గర్భిణులు ఎందరు వస్తున్నదీ వారికి అందుతున్న సేవలు గురించి, ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేస్తున్న విషయాలను డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయ్ కుమార్‌ను అడగడంతో ఆ వివరాలు ఆన్‌లైన్ చేసిన విధానం తెలియజేశాడు. రోగుల వివరాలు నమోదుతోపాటు వారి ఫోన్ నెంబర్‌ను నమోదు చేసినట్లయితే క్యాంప్‌నకు రానిచో వారికి ఫోన్‌చేసి పిలిచేందుకు వీలవుతుందని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సూచించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అవ్వ–తాత కంటివెలుగు ప్రోగ్రాంలో భాగంగా ఎందరిని పరీక్షించారనే దానిపై వివరాలు అడిగి, ఎంతమందికి ఆపరేషన్లు చేశారో, ఎందరికి కళ్లజోళ్లు అందించారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, సూపర్‌వైజర్ కొండపల్లి సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్‌ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### జెడ్పీ పాఠశాల తనిఖీ

మునగపాడు గ్రామంలో జెడ్పీ పాఠశాలను జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తనిఖీచేశారు. బడి ఈడు పిల్లలు బడిలో కొనసాగుతున్నారా, ఎందరు డ్రాప్‌అవుట్‌లో ఉన్నారో వాటి వివరాలను ఎంఈవోలు మహబూబ్ సుభానీ, రవికాంత్‌లను ప్రశ్నించారు. బడి బయట పిల్లలు తప్పనిసరిగా బడిలో చదువుకునేలా చూడాలని చెప్పారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన యూనీఫాం, బూట్లు తప్పనిసరిగా ధరించి వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. మరింత మెరుగుగా ఉండేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి శైలజ, ఏపీసీ విజయలక్ష్మి, ఎంపీడీవో డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, వీఆర్వోలు బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, పాఠశాలహెచ్‌ఎం అంజనేదేవి పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

కేఎల్‌యూ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు



**తాడేపల్లిరూరల్:** వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం సీఈఏ (సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ) ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం పెదకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు మాట్లాడారు. విద్యార్థులను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు అభినందించారు. కార్యక్రమంలో సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ రూతు రమ్య, సీఈఏ ప్రో. ఇన్‌ఛార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.